క్లుప్తంగా

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

తిరుపతి క్రైమ్: న్యూ బాలాజీ కాలనీలో బుధవారం విద్యుదాఘాతంతో ఓ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీను(46) నగరంలో వలస కార్మికుడిగా పని చేస్తున్నాడు. ముస్కాన్‌బాషా అనే వ్యక్తి నిర్మిస్తున్న ఇంట్లో పనిచేస్తుండగా విద్యుత్‌తీగలు తగలడంతో ప్రమాదం జరిగింది. వెంటనే రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు ఎస్వీయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు.

మానవ అక్రమ రవాణా చట్ట వ్యతిరేకం

తిరుపతి అన్నమయ్య సర్కిల్: మానవ అక్రమ రవాణా చట్ట వ్యతిరేకమని తిరుపతి రైల్వే స్టేషన్ ఇన్‌చార్జి మేనేజర్ జ్ఞానేంద్ర కుమార్ తెలిపారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, రైల్వే అధికారుల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా పాల్పడుతున్న ప్రతి ఒక్కరికీ చట్టపరమైన శిక్షలు తప్పవన్నారు. రైల్వే చైల్డ్ హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జ్ బాలాజీ మాట్లాడుతూ పిల్లలను అనుమానాస్పదంగా తీసుకెళ్తూ కనిపిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1098 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శ్రీనివాసులు శెట్టి, హెల్ప్‌లైన్ సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి..



బోల్తాపడిన ఆటో, గాయపడిన ప్రయాణికుడు

తిరుపతి రూరల్ : జాతీయ రహదారిపై ప్యాసింజర్ ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందగా పలువురు ప్రయాణికులు గాయపడిన ఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి రూరల్ గాంధీపురం పంచాయతీ పరిధిలోని బాలాజీ డెయిరీ సమీపంలో పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై చంద్రగిరి నుంచి తిరుపతి వైపునకు వెళ్లే ప్యాసింజర్ ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో పాతకాల్వకు చెందిన డ్రైవర్ కనికాచలం (50) అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే గాజులమండ్యంకు చెందిన రామయ్యకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. రూరల్ సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక రైలు.. రెండు టికెట్లు

- తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో జర్నీ ఇక్కట్లు
- తిరుపతికి ఎక్స్‌ప్రెస్ టికెట్ కడపలో కొనాలి
- గుంతకల్లు, కడప మధ్య ప్యాసింజర్ టికెట్
- ప్రయాణికులకు తప్పని తిప్పలు



విశాఖ–తిరుపతి–కడప (తిరుమల) ఎక్స్‌ప్రెస్ రైలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: రైలు ఒక్కటే.. కానీ అందులో ప్రయాణించాలంటే మాత్రం రెండు టికెట్లు కొనాలంట.. ఇదీ తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేయాలంటే నిబంధన. విశాఖ–తిరుపతి–కడప మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను నెల రోజుల కిందట గుంతకల్లు జంక్షన్ వరకు పొడిగించారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే ఈ పొడిగింపు ప్రక్రియ విధానంలో రైల్వే అధికారులు మార్పులు చేశారు. ఇదేమిటంటే కడప నుంచి గుంతకల్లు వరకు ప్రత్యేక ప్యాసింజర్ రైలుగా మార్చారు. ప్రయాణ టికెట్ విషయంలో మాత్రం గజిబిజి విధానాన్ని అమలు చేశారు. కడప–గుంతకల్లు మధ్య మాత్రం ప్యాసింజర్ (జనరల్) టికెట్ తీసుకోవాలి. అయితే గుంతకల్లు వైపు నుంచి తిరుపతికి రావాలంటే కడపలో దిగి, అక్కడి నుంచి ఎక్స్‌ప్రెస్ టికెట్ కొనాలని నిబంధన పెట్టారు. కాకపోతే కడపలో ట్రైన్ అరగంట ఆగుతుంది.

చాలామందికి విషయమే తెలియదు..

జనరల్ టికెట్లు తీసుకున్న ప్రయాణికులు గుంతకల్లు–కడప మధ్య జనరల్ బోగీలతో పాటు స్లీపర్‌లో సైతం ప్రయాణించడానికి మాత్రం వెసులుబాటు కల్పించారు. ఈ రైలు గుంతకల్లు నుంచి తిరుపతికి కడప మీదుగా వెళ్తుందనే విషయం చాలావరకు ప్రయాణికులకు తెలియడం లేదు. ఈ విషయం సూచించే విధంగా బోర్డులో మార్పులు, చేర్పులు లేకపోవడంతో తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ఇదే విషయాన్ని కొందరు ప్రయాణికులు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టికెట్లను కొనుగోలు చేసే విషయంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని, దీనిపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారనే హామీలు ఇస్తున్నారు. ప్రస్తుతం రైలును గుంతకల్లు వరకు పొడిగించి పరీక్షిస్తున్నామని, త్వరలో రైలు నేమ్‌బోర్డులో మార్పులు చేస్తామని రైల్వే అధికారులు చెబుతున్నారు.

ప్రయాణికులకు తప్పని కష్టాలు..

తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణంలో ప్యాసింజర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గమ్యస్థానం చేరుకోవడానికి ఒకే రైల్లోనే రెండు టికెట్లు కొనాల్సి రావడం సినిమా కష్టాలను తలపిస్తోంది. గతంలో తిరుమల ఎక్స్‌ప్రెస్ కడప నుంచి తిరుపతి, విశాఖ మీదుగా కొర్బా వెళ్లేది. తిరుపతి నుంచి వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం గుంతకల్లు వరకు పొడిగించారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించండి

- ప్రతిసారి జరిమానాలు వేయడం కాదు.. లైసెన్స్ రద్దు చేస్తాం
- ఆహార సంబంధిత కేసుల విచారణ సందర్భంగా జేసీ శుభం బన్సల్



శుభం బన్సల్, జాయింట్ కలెక్టర్

తిరుపతి అర్బన్: ఆహార సంబంధిత షాపులు, దుకాణాలు, హోటళ్లు తదితర వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం ఆహార సంబంధిత పాత కేసులను జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. ఆహార భద్రతాధికారుల ఆధ్వర్యంలో వ్యాపారులను కలెక్టరేట్‌లో సమావేశపరిచారు. ఆ మేరకు జేసీ విచారణ అనంతరం ఆయన ఆహార ప్రమాణాలను పాటించని పలువురు వ్యాపారులకు జరిమానా విధించారు. ప్రధానంగా తిరుపతిలోని ఓ ఐస్‌క్రీమ్ ఏజెన్సీ షాపునకు రూ.50 వేలు, రెస్టారెంట్, దాబాలు, హోటళ్లకు రూ.1.15 లక్షలు, సరైన లేబుల్ వివరాలు లేకుండా వాటర్ బాటిల్స్ విక్రయిస్తున్న ఓ వ్యాపారికి రూ.30 వేలు, ఓ రెసిడెన్షియల్ విద్యాసంస్థకు రూ.30 వేలు, నాణ్యతలేని నెయ్యి విక్రయించిన వ్యాపారికి రూ.15 వేలు, బేకరీ నిర్వాహకుడికి రూ.10వేలు, వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా వివిధ ఆయిల్ స్టాల్స్ ప్యాకెట్లు ముద్రించిన వారికి రూ.2 లక్షలు, ఓ వ్యాపారి కాలపరిమితికి మించిన ఆహార పదార్థాలను దుకాణంలో ఉంచినందుకు రూ.15వేలు జరిమాన విధించారు. మొత్తంగా 20కేసులకు సంబంధించి 4,92,000 జరిమాన వేశారు. ఇకపై వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను పాటించడంతోపాటు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ పొందిన తర్వాతే వ్యాపారం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతిసారి జరిమానాతో సరిపెట్టడం కుదరదని.. మరోసారి ఇలా చేస్తే లైసెన్స్ రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

హోరాహోరీగా ముగిసిన క్రికెట్ పోటీలు



అండర్–14 విభాగంలో విజేతగా నిలిచిన లిటిల్ ఏంజెల్స్ స్కూల్ టీం



అండర్–17 విభాగంలో విజేతగా నిలిచిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : తుమ్మలగుంట క్రీడా మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహించిన అండర్–14, 17 జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలకు రెండు విభాగాల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన 14 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో అండర్–14 విభాగంలో లిటిల్ ఏంజెల్స్ పాఠశాల జట్టు విజేతగా నిలువగా, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జట్టు రన్నరప్‌గా, సోక్రటీస్, నాగార్జున పబ్లిక్ స్కూల్ జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. అలాగే అండర్–17 విభాగంలో ఇంటర్ నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జట్టు విజేతగా, రెయిన్‌బో స్కూల్ టీం రన్నరప్‌గా, జీఎస్ఆర్ మాగ్నటిక్, లిటిల్ ఏంజెల్స్ స్కూల్స్ జట్లు తృతీయ స్థానం సాధించాయి. గెలుపొందిన జట్లకు, బెస్ట్ క్రికెటర్లకు లక్ష్మీ చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ కొప్పర్ల దివాకర్ చేతుల మీదుగా ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.దేవరాజ్, ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి కె.హేమంత్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆగని గజరాజుల దాడులు





పంటపొలాల్లో బీభత్సం సృష్టిస్తున్న ఏనుగులు

- నరసింగాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని పంట పొలాలపై దాడి
- 24 గంటల గడవక ముందే మరోసారి బీభత్సం
- లబోదిబోమంటున్న రైతన్నలు

చంద్రగిరి: పంట పొలాలపై గజరాజుల దాడులు ఆగడం లేదు. 24 గంటలు గడవకముందే మరోసారి పంట పొలాలపై ఏనుగులు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రైతుల వివరాల మేరకు.. మంగళవారం తెల్లవారుజామున ఏనుగుల మంద నరసింగాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని పంట పొలాలపై దాడులకు తెగబడ్డాయి. అక్కడ నుంచి రూటు మార్చి శ్రీవారిమెట్టు కాలినడక మార్గం వైపు వెళ్లాయి. దీంతో టీటీడీ విజిలెన్స్, అటవీ అధికారులు ఏనుగులను అటవీ ప్రాంతంలోకి దారి మళ్లించారు. అయితే అర్ధరాత్రి సమయంలో సుమారు 13 ఏనుగులు నరసింగాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని పంట పొలాల్లోకి చొరబడి బీభత్సం సృష్టించాయి. వరి పంటను పూర్తిగా నాశనం చేయడంతో పాటు అరటి చెట్లను ధ్వంసం చేశాయి. అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున వరకు ఏనుగులు తిష్ట వేయడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని బాణసంచాలు పేల్చుతూ, డప్పులు వాయిస్తూ అడవిలోకి తరిమేందుకు ప్రయత్నించారు. అయితే ఏనుగులతో పాటు గున్న ఏనుగులు ఉండడంతో అవి అక్కడ నుంచి కదలకపోవడంతో వారు చేసేదేమీ లేక వెనుదిరిగారు. ఆపై ఉదయం ఏనుగుల గుంపు అడవిలోకి వెళ్లిపోయినట్లు రైతులు తెలిపారు.

పంట చేతికొచ్చే సమయంలో ఇలా..

ఆరుగాలం కష్టపడి పండించిన వరి, అరటి పంటలను ఏనుగులు నాశనం చేస్తున్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు వచ్చినట్లు అటవీ అధికారులకు సమాచారం అందిస్తే, సిబ్బంది మాత్రమే వచ్చి.. నామమాత్రంగా బాణసంచా పేల్చారన్నారు. అయితే ఏనుగులు వెనుదిరగకపోవడంతో తామేమీ చేయలేమని వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో నెలన్నర రోజుల్లో పంట చేతికొస్తుందనుకునే లోపు ఏనుగుల దాడులతో కన్నీళ్లు మిగిలుతున్నాయని వాపోయారు.

ముగిసిన రెండవ విడత వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ

తిరుపతి సిటీ: ఇంజినీరింగ్ ప్రవేశాలలో భాగంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు కొనసాగిన వెబ్‌ఆప్షన్ల రెండవ విడత ప్రక్రియ బుధవారంతోముగిసింది.శుక్రవారం వెబ్‌ఆప్షన్ల మార్పుకు అవకాశం ఇస్తూ 4వ తేదీన రెండవ విడత సీట్ల కేటాయింపు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ బదిలీలతో మార్పు అసాధ్యం మేడమ్

- అందరినీ బదిలీ చేస్తేనే ప్రక్షాళన చేసినట్లు అవుతుంది
- పదోన్నతి పొందిన వ్యక్తి..కింద పోస్టులో తిష్ట వేయడం మన కార్పొరేషన్‌లోనే సాధ్యం
- కమిషనర్‌కు ఓ అధికారి బహిరంగ లేఖ



నగరపాలక సంస్థ కార్యాలయం



రెవెన్యూ ఆఫీసర్ చాంబర్

తిరుపతి తుడా: ''తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో ప్రక్షాళన చేయాలని మీరు కంకణం కట్టుకున్నారు.. నాలుగైదేళ్లుగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఉద్యోగులను మాత్రమే బదిలీ చేశారు..అదే శాఖలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న ఓ అధికారిని మాత్రం కదిలించలేకపోయారు.. ఆ శాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలంటే రెవెన్యూ ఆఫీసర్ నుంచి గుమస్తా వరకు బదిలీ చేస్తేనే మీరు అనుకున్న లక్ష్యానికి అర్థం ఉంటుంది.. అలాకాకుండా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఏళ్ల తరబడి తిష్ట వేసిన వ్యక్తిని బదిలీ చేయకుండా కిందిస్థాయిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసినంత మాత్రాన ఆ శాఖ ప్రక్షాళన జరిగినట్టు కాదన్న విషయం మీ దృష్టికి తీసుకొస్తున్నా'' అంటూ ఓ అధికారి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్. మౌర్యకు బహిరంగ లేఖ రాయడం సంచలనంగా మారింది. అలాగే ఆ లేఖను చీఫ్ సెక్రటరీ, పురపాలక శాఖ మంత్రికి, మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీలకు పంపించారు. ఇంకా ఆ లేఖలో.. 'కమిషనర్‌గా మీరు బాధ్యతలు తీసుకున్న వెంటనే ప్రక్షాళన చేయాలని భావించారు.. మార్పు తీసుకురావాలన్న మీ ఆలోచన మంచిదని అందరూ భావించారు.. ఉద్యోగులు కూడా అందరికీ సమన్యాయం దక్కుతుందని సంతోషపడ్డారు. కానీ ఆ స్థాయిలో ప్రక్షాళన జరగకపోగా 15 ఏళ్లకు పైగా ఒకే పోస్టులో ఉన్న అధికారిని మీరు కదిలించకపోవడం ఉద్యోగులందరి నమ్మకాన్ని దెబ్బతీసింది' అంటూ ఆయన ఆవేదన వెళ్లగక్కారు.

మరొకరికి అవకాశం ఇవ్వరా?

సీనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది చాలామంది ఉద్యోగులు కార్యాలయంలోని అన్ని పోస్టుల్లోనూ పనిచేయాలని భావిస్తున్నారని.. రిటైర్ అయ్యే లోపు రెవెన్యూ ఆఫీసర్‌గా.. మేనేజర్‌గా పని చేయాలనే కోరిక ఉంటుందని లేఖలో వివరించారు. 15 ఏళ్లుగా రెవెన్యూ ఆఫీసర్‌గా ఒకే వ్యక్తి కొనసాగడం వల్ల అనేకమంది ఉద్యోగులు ఆ పోస్టులో పని చేయకుండానే రిటైర్డ్ అయిపోయారన్నారు. అతి తక్కువ కాలంలో మరి కొందరు రిటైర్ అయ్యేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. సీనియర్లకు ముఖ్యమైన పోస్టుల్లో పనిచేసే అవకాశాన్ని ఇవ్వండి.. మేనేజర్‌గా పదోన్నతి పొందిన రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవను ఆ పోస్టులోకి పంపించి, మరో సీనియర్ సూపరింటెండెంట్‌కు ఆర్ఓగా అవకాశం కల్పించాల్సిన బాధ్యత మీపై ఉంది మేడమ్ అని కోరారు. ప్రస్తుతం ఈ లేఖ తీవ్ర దుమారం రేగడంతో పాటు చర్చనీయాంశంగా మారింది.

డీ అడిక్షన్ సెంటర్ల నిర్మాణం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణ నాయక్

తిరుపతి తుడా: మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి బయట పడడానికి ప్రధాన చికిత్స అయిన డీ అడిక్షన్ సెంటర్ల నిర్మాణం అవసరమని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు.జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన వైద్యులు, ఎన్జీఓల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యసనం తీవ్రమైన సమస్యని, దీని నుంచి బయటపడాలంటే మెడికల్ కేర్, సైకలాజికల్ ట్రీట్‌మెంట్ అవసరమన్నారు. సమావేశంలో డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావ్, ఏఓ డాక్టర్ మురళీకృష్ణ, సీతారామ్ నాయుడు పాల్గొన్నారు.

కేసులు..కబ్జాలే టీడీపీ నేతల నైజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భాకరాపేట: డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సామకోటి సహదేవరెడ్డిని విమర్శించే అర్హత స్థాయి చిన్నగొట్టిగల్లు మండలం టీడీపీ నేతలకు లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. మరోసారి విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. భాకరాపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన్, సర్పంచ్ సాకిరి భూపాల్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. మోహన్ మాట్లాడుతూ సహదేవరెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూకబ్జాలు, దాడులు, అక్రమ కేసులు పెట్టడం టీడీపీ నాయకుల నైజమని విమర్శించారు. మీడియా సమావేశంలో మంగళవారం టీడీపీ నేతల ఆరోపణలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమన్నారు. భూపాల్ మాట్లాడుతూ భూకబ్జాలు చేశామని తమపై చేసిన ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలన్నారు. కేంద్రప్రభుత్వం తనకు ఐదు ఎకరాలను మిలిటరీ కోటాలో మంజూరు చేసిందన్నారు. అందులో మామిడి చెట్లు పెడితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ధ్వంసం చేశారని తెలిపారు. రైతు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ మారసానివారిపల్లిలో తన చింత చెట్టును కోసి అడ్డుకున్న తమపై టీడీపీ నాయకులు కేసులు పెట్టి వేధించింది నిజం కాదా ? అని ప్రశ్నించారు. సర్పంచులు శంకర్ రెడ్డి, విజయ్, నాయకులు బాబి, మునిరామ్, షాబాద్, ఆదినారాయణ రెడ్డి, వీరప్రతాప్ రెడ్డి, హరి, శ్రీధర్ రెడ్డి, ఉమ, మణి, క్రాంతి పాల్గొన్నారు.

మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్



ఎన్‌బీఏ గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న ఈఓ

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు 2028వ సంవత్సరం వరకు నేషనల్ బోర్డు అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. టీటీడీ ఈవో శ్యామలరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతమ్మ, అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషితో నేషనల్ బోర్డ్ అక్రిడిటేషన్ గుర్తింపు లభించిందన్నారు. గత నెలలో న్యూఢిల్లీ నుంచి విచ్చేసిన ఎన్‌బీఏ నిపుణుల బృందం కళాశాలలోని ప్రయోగశాలలు, అధ్యాపకులు, సిబ్బంది వివరాలు, రికార్డులు, మౌళిక సదుపాయాలను పరిశీలించారు. కళాశాలలో బోధన, ల్యాబ్స్, లైబ్రరీ తదితర అంశాలపై విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించారు. నేషనల్ బోర్డ్ నిబంధనల మేరకు పాలిటెక్నిక్ కళాశాలను నిర్వహిస్తుండడంతో ఎన్‌బీఏ గుర్తింపు ఇచ్చారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



పట్టుబడిన సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: రాత్రి పూట తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను పుత్తూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పుత్తూరు డీఎస్పీ రవి కుమార్, పుత్తూరు సీఐ ఆధ్వర్యంలో చాకచక్యంగా పట్టుకున్నారు. రెండు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో కేసులున్న తమిళనాడుకు చెందిన మనీ అలియాస్ కోవిల్ మనీ (38), సురేష్ అలియాస్ గుణ(35), తిరుపతి మంగళంకు చెందిన కుమార్(29), మణికంఠ(25), పట్టుబడ్డారు. ఈ కేసులో తమిళనాడుకు చెందిన ప్రభు(26), మణిగండన్(47) ఇద్దరు పరారీలో ఉన్నారని వివరించారు. వీరంతా పలుమార్లు జైలు కెళ్లి జైల్లో పరిచయాల వల్ల ముఠాగా ఏర్పడ్డాయని చెప్పారు. వీరి నుంచి 190 గ్రాముల బంగారు, 2.3 కిలోల వెండి ఆభరణాలను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ సుమారు రూ.20.4లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసును ఛేదించడంలో పుత్తూరు పోలీసులు ఎంతగానో కృషి చేశారన్నారు. నిందితులందరిపై షీట్ ఓపెన్ చేస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు భరోసా



సుభాష్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు: పుత్తూరు మున్సిపాలిటీ 26వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోపి కుమారుడు సుభాష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాల పాలయ్యాడు. ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతన్ని బుధవారం మాజీ మంత్రి ఆర్కేరోజా పరామర్శించారు. అలాగే పుత్తూరు మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఎలుమలైరెడ్డి సతీమణి అనారోగ్యం బారిన పడి చికిత్స తీసుకున్నారు. ఆమెను రోజా పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వైభవంగా గంగ జాతర



గంగమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: కేవీఆర్‌పురంలో బుధవారం గంగ జాతరను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం సాయంత్రం మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. మాజీ మంత్రి ఆర్కేరోజా అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమెకు గ్రామస్తులు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు.

అక్షరాస్యతే 'ఉల్లాస్ అక్షరాంధ్ర' లక్ష్యం

- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు



శిక్షణకు హాజరైన అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది

తిరుపతి రూరల్ : నిరక్షరాసులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ''ఉల్లాస్ అక్షరాంధ్ర'' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పేర్కొన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం జిల్లా స్థాయి అక్షరాంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2023లో నిర్వహించిన సర్వే ద్వారా జిల్లాలో గుర్తించిన 88,687 మంది వయోజనులైన నిరక్షరాసులను అక్షరాస్యులుగా చేయడానికి డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మాల ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ మహమ్మద్ ఆజాద్ మాట్లాడుతూ జిల్లాకు ఇచ్చిన టార్గెట్‌లో 67,170 మందిని డీఆర్‌డీఏకి, 7,280 మందిని డ్వామాకు, 14,237 మందిని మెప్మాకు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. అభ్యసన పూర్తయిన తరువాత అభ్యాసకులందరికీ 2026 మార్చిలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. నోడల్ ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమం విజయ వంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. ఎంపీడీఓ రామచంద్ర, ఏపీఎంలు, ఏపీవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడ్మిషన్ పొందిన వారి 'వసతి'కి వినతి


జేఈఓకు విన్నవిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలల్లో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికీ హాస్టల్ సీటు కేటాయించాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు రాపూరి ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మానికి విన్నవించారు. దళిత సంఘాల నేతలు కల్లూరు చంగయ్య, సుధాకర్ మాదిగ, యుగంధర్, ప్రభు పాల్గొన్నారు

పరిశోధనలపై ముగిసిన వర్క్‌షాప్


వర్క్‌షాప్‌నకు హాజరైన వైద్యులు, అతిథులు

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాల చిన్న పిల్లల విభాగం ఆధ్వర్యంలో వైద్య పరిశోధనలపై మూడు రోజులుగా కొనసాగిన వర్క్‌షాపు బుధవారంతో ముగిసింది. కార్యశాలలో భాగంగా నూతన ఆవిష్కరణలపై పలు వైద్య కళాశాలల నుంచి విచ్చేసిన యువ వైద్యులకు రీసెర్చ్ మెథడాలజీపై పరిశోధనాత్మక శిక్షణ నిచ్చారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కిరీటి, బెనారస్ హిందూ యూనివర్సిటీ వారణాసికి చెందిన బయో మెడికల్ పరిశోధకులు డాక్టర్ సంజీవ్ కుమార్, డాక్టర్ గౌరీ బాలచందర్, మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డాక్టర్ తనూ ఆనంద్, డాక్టర్ తరుణ గుప్తా , డాక్టర్ కుమార్ విక్రమ్, వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్ ఆర్వీ సురేష్ కుమార్ పాల్గొన్నారు

కళాశాల అక్రమాలపై ఫిర్యాదు


ఆర్ఐఓకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి సిటీ : స్థానిక శ్రీనివాసపురంలోని ఎస్ఆర్ కళాశాల అక్రమాలపై ఆర్ఐఓ రాజశేఖర్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ నేతలు బుధవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఎస్ఆర్ కళాశాలలో ప్రవేశాలకు ముందు మెరిట్ 500 మార్కుల నుంచి 600 మార్కుల లోపు వచ్చిన విద్యార్థులకు ప్యాకేజీ పేరుతో చేర్చుకొని రూ. 50 వేలు మాత్రమే ఫీజు చెల్లించాలని తల్లిదండ్రులకు చెప్పారన్నారు. అడ్మిషన్ పొందిన తర్వాత అదనంగా రూ.20 వేలు వసూలు చేశారని ఆరోపించారు. పూర్తి ఫీజు చెల్లిస్తే కానీ, టీసీలు ఇవ్వమని బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఆర్ కళాశాల అనుమతులు తక్షణం రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి రవి, నగర కార్యదర్శి తేజ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సు


తపస్సు మాను ఎక్కుతున్న అర్జున వేషధారి

తిరుపతి రూరల్ : మండలంలోని దుర్గసముద్రం గ్రామంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు అలరించింది. మహాభారతం ఉత్సవాల్లో భాగంగా మూల మూర్తులకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి రాణిరెడ్డి హరికథా కాలక్షేపం చేపట్టారు. అనంతరం అర్జున వేషధారి తపస్సుమాను అధిరోహించారు. విబూది, నిమ్మకాయలను విసురుతూ భక్తులను ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాద రెడ్డి, ఉభయకర్త జయసింహారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కమిటీ సభ్యులు నాదముని రెడ్డి, రమేష్ రెడ్డి, జ్యోతి రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

చంద్రగిరి : స్థానిక ప్రభుత్వ బాలుర కళాశాలలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ప్రకాష్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలుగా మారితే జీవితం ఛిద్రమవుతుందని హెచ్చరించారు. విజయవాడకు చెందిన ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం ద్వారా ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. యువత అప్రమత్తంగా వ్యవహరిస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని సూచించారు. అనంతరం మత్తుతో వాటిల్లే అనర్థాలు తెలిసేలా రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధ్యాపకులు రాజనాల, సాయి మాధురి, సుబ్బరాయుడు, స్వర్ణలత, శివకుమార్, రమాదేవి, సుబ్రమణ్యం, సురేంద్ర పాల్గొన్నారు.

8 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి నగరంలో నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న 8 మందికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు.

సంక్షోభంలో వసతి

"వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల హాస్టల్‌లో వసతులు లేవు. ఇళ్ల వద్ద చదువుకునే పరిస్థితి లేక ఇక్కడి వస్తే నిర్వహణ పూర్తిగా లోపించింది. పిల్లలకు పరిశుద్ధ జలం కూడా అందించలేని దుస్థితి దాపురించింది. ప్రశాంత వాతావరణంలో విద్యాభ్యాసం చేసుకునే అవకాశం కూడా ప్రభుత్వం కల్పించలేక చేతులెత్తేసింది. ఏదేదో చేసేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటించిన మంత్రి లోకేష్ అసమర్థత తేటతెల్లమవుతోంది" అంటూ వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మండిపడ్డారు.

- ఉక్కపోతతో విద్యార్థులు ఉక్కిరి బిక్కిరి
- మంచినీరు లేదు.. మరుగుదొడ్లు లేవు
- అపరిశుభ్రంగా వంట తయారీ గదులు
- బీసీ హాస్టల్ పరిశీలనలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి


బీసీ హాస్టల్‌లో భోజనం పరిశీలిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకుని బస చేయడం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టల్ కనీసం వసతులు కూడా లేకుండా సంక్షోభంలో ఉందని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి తిరుపతి రూరల్ మండలం తాటితోపు వద్ద ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పడక గదులను పరిశీలించారు. అనంతరం చదువుకోవడానికి ప్రత్యేక గది లేకపోవడం, డైనింగ్ హాలుకు కిటికీలు లేకుండా, ఫ్యాన్లు తిరగకుండా ఉండడంతో ఉక్కపోతతో పిల్లలు ఉక్కిరిబిక్కిరవడాన్ని గమనించారు. వంట తయారీ గదిలో అపరిశుభ్రతను చూసి ఇలాగైతే పిల్లలు ఎలా తింటారని ప్రశ్నించారు. అయితే రాత్రి భోజనానికి తయారు చేసి పప్పు, అన్నం, కోడిగుడ్లను పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత స్టోర్ రూమ్‌లో కోడిగుడ్లు, అరటిపండ్లు, కాయగూరలు, బియ్యం, ఇతరత్రా సరుకులను తనిఖీ చేశారు. వ అనంతరం పిల్లలతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు సక్రమంగా లేవని, బట్టలు ఉతకడానికి సరిపడా స్థలం లేకపోవడం ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

సౌకర్యాలు కల్పించండి

యువగళం పాదయాత్రలో విద్యార్థుల కష్టాలు తెలుసుకుని విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చానని డబ్బా కొట్టుకునే మంత్రి నారా లోకేష్ వసతి గృహాల్లో సంక్షోభం గురించి ఏం సమాధానం చెబుతారని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ప్రశ్నించారు. విద్యా వ్యవస్థ బాగుచేయడం దేవుడెరుగు కనీసం వసతి గృహాల్లో సంక్షేమాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు సొంత నియోజక వర్గం చంద్రగిరిలోనే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చన్నారు. చిన్నగొట్టిగల్లు, భాకరాపేట హాస్టళ్లలో మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. ఈ క్రమంలోనే హాస్టల్ వార్డెన్ శ్రీదేవితో మాట్లాడి ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన బిల్లుల సమాచారం తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు బి.ఓబుల్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, గూడూరు రఫీ, భానుప్రకాష్‌రెడ్డి, యశ్వంత్, నక్కా హరిబాబు, శేషు, వెంకటరమణనాయక్, పార్థసారథి పాల్గొన్నారు.

కనీస వసతులు కరువు

తిరుపతి అర్బన్ : సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు కరువయ్యాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జూపార్క్ రోడ్డులోని ఉన్న జ్యోతిరావు పూలే ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్‌ను సందర్శించారు. వసతిగృహంలో సమస్యలను పరిశీలించారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. నేతలు హరి ప్రసాద్ నాయక్, ముని, ప్రణదీప్ ,హేమంత్, మహేష్ ,భరత్, భాను, గౌతమ్, సాయి పాల్గొన్నారు.


విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు

'కంఠం' భూముల విస్తరణపై దృష్టి

తిరుపతి రూరల్ : మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల ఇళ్లకు విలువ కల్పించేందుకు గ్రామ కంఠం భూముల పరిధిలోకి తీసుకురావాలని ఎంపీడీఓ రామచంద్ర ఆదేశించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఈఓపీఆర్‌డీ దయాసాగర్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామకంఠం భూముల సమీపంలోని పట్టా స్థలాల్లో ఇల్లు కట్టుకున్న వారికి కూడా గ్రామకంఠం కిందనే రిజిస్ట్రేషన్లు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ మేరకు ఇంటి నిర్మాణాల వివరాలు సేకరించాలని కోరారు. అందుకు అనుగుణంగా ఎఫ్ఎన్‌బీ తయారు చేసి గ్రామకంఠం భూముల విస్తరణకు నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకు సి.గొల్లపల్లె, దుర్గసముద్రం, వేమూరు, రామానుజపల్లె, సి.మల్లవరం పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు వివరించారు.


సూచనలిస్తున్న ఎంపీడీఓ రామచంద్ర

మురుగు నిల్వ చేరకుండా చర్యలు

తిరుపతి తుడా : డ్రైనేజీల్లో మురుగు నిల్వ చేరకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. బుధవారం 31వ వార్డులోని బొమ్మగుంట తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు, అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు నిల్వ ఉంటే దోమలు వ్యాపిస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టి, దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేయాలని సూచించారు. బొమ్మగుంటలో పారిశుద్ధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టి, సకాలంలో తాగునీరు సరఫరా చేయాలని కోరారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, డీసీపీ ఖాన్, ఏసీపీ బాలాజీ, డీఈలు మధు, శిల్ప, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.


పారిశుద్ధ్యంపై ఆరా తీస్తున్న కమిషనర్ మౌర్య

ఆగస్టు 31న 'నిమజ్జనం'

తిరుపతి అర్బన్ : ఆగస్టు 31వ తేదీన వినాయక నిమజ్జనం ఉంటుందని తిరుపతి నగర వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఈ మేరకు కలెక్టర్‌ను కమిటీ సభ్యులతో వెళ్లి కలిశారు. వారు మాట్లాడుతూ నిమజ్జనోత్సవం రోజున నగరంలో వైన్‌షాపులను మూయించాలని కోరారు. తిరుపతిలో ఎక్కడా మద్యం లభించకుండా ఎక్సైజ్, పోలీసుశాఖను ఆదేశించాలని విన్నవించారు. ప్రతిమలను నిమజ్జనం చేసే వినాయకసాగర్, చెన్నాయగుంట చెరువు, దామినేడు చెరువు, గొల్లపల్లె చెరువు వద్ద భద్రత కల్పించాలని సూచించారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కమిటీ సభ్యులు ఆర్‌సీ మునికృష్ణ, కరాటే శ్రీనివాస్, ఆకుల సతీష్, గుండాల గోపీనాథ్, చెన్నం నవీన్, పార్థు, రెడ్డిబాబు, ఆనంద్, వాసు, భాస్కర్‌నాయుడు, సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వినాయక మహోత్సవ కమిటీ

ముగిసిన దుకాణాల వేలం

తిరుపతి తుడా : కార్పొరేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలకు కమిషనర్ మౌర్య సమక్షంలో బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. కరంబాడి మార్గంలోని వినాయక సాగర్ వద్ద గల దుకాణ సముదాయం, వినాయక సాగర్ పార్కింగ్, ప్రవేశ రుసుం, గేమ్ జోన్, లీలా మహల్ వద్ద గల షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదులు, ఇందిరా మైదానంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇందిరాప్రియదర్శిని కూరగాయల మార్కెట్ లోని దుకాణాలకు, శ్రీనివాసం ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులకు బహిరంగ వేలం చేపట్టారు. అయితే వినాయక సాగర్ పార్కింగ్, ప్రవేశ రుసుం, గేమ్ జోన్ వేలం వాయిదా పడింది. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ లోని దుకాణాలకు, శ్రీనివాసం ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్ లోని దుకాణాలకు, వైకుంఠపురం మార్కెట్ నందు గల దుకాణాలకు నిర్వహించిన వేలంలో ఎవరూ పాల్గొనలేదు. వేలం ప్రక్రియను డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి పర్యవేక్షించారు.

16న తిరుచానూరులో గోకులాష్టమి

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణస్వామి గుడిలో ఆగస్టు 16వ తేదీన గోకులాష్టమి నిర్వహించనున్నారు. బుధవారం ఈ మేరకు టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది. గోకులాష్టమి రోజున అభిషేకం, అర్చన, స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ జరిపించనున్నారు. రాత్రి స్వామివారు పెద్దశేష వాహనంపై మాడ వీధుల్లో విహరించనున్నారు. అనంతరం గోపూజ, గోకులాష్టమి ఆస్థానం చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే సహస్ర దీపాలంకరణ సేవను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

తిరుపతి సిటీ : ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ కేవీ రమణ, డీఎస్పీ శ్రీలత , ప్రొఫెసర్ సాయి సుజాత, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డీసీపీఓ శివశంకర్ పాల్గొన్నారు.వారు మట్లాడుతూ మనుషుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. సైబర్ నేరాల నుంచి తప్పించుకునేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1930 సమాచారం అందించాలని సూచించారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధికారులు,

'నిసార్' విజయవంతంపై సంబరాలు

తిరుపతి గాంధీ రోడ్డు : జీఎస్ఎల్‌వీ ఎఫ్–16 రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా కక్షలోకి ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా నగరంలో పలువురు నేతలు జాతీయ జెండాలు చేతబట్టి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ఇస్రో తన విజయ పరంపరను కొనసాగిస్తోందని కొనియాడారు. శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. నేతలు గుండాల గోపీనాథ్, ఏవన్ మస్తాన్, జయంతి కుమార్, జగదీష్, లోక ప్రభాకర్ నాయుడు, నాన్నయ్య ఆచారి, కేశవులు, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి సిద్ధేంద్ర శర్మ కోటేశ్వరరావు, సునీల్ కుమార్ స్వామి పాల్గొన్నారు.



స్వీట్లు పంచుతున్న నేతలు

డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ


ఆస్పత్రిలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ

తిరుపతి తుడా : కరకంబాడి రోడ్డులోని లావణ్య ఫెర్టిలిటీ సెంటర్‌ను డీఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఏఆర్‌టీ చట్టం మేరకు ఐవీఎఫ్ కేంద్రాలు కార్యకలాపాలు సాగించాలని సూచించారు. డీఐఓ డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

'జక్కదొన'కు ప్రథమ బహుమతి



తిరుపతి కల్చరల్ : ఆర్‌సీ కృష్ణస్వామి రాజు రచించిన 'జక్కదొన' పుస్తకానికి 2025 కథా సంపుటాల పోటీలో ఖమ్మం హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ వారి ప్రథమ బహుమతి లభించింది. ఈమేరకు ఆగస్టు 17వ తేదీన ఖమ్మంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో రచయితకు నగదు బహుమతితో పాటు జ్ఞాపిక అందించనున్నట్లు నిర్వాహకులు తోట సుభాషిణి బుధవారం తెలిపారు. పాత చిత్తూరు జిల్లా సామాజిక స్థితిగతులు, సాంస్కృతిక నేపథ్యాన్ని సామాన్యుడి సంభాషణల్లో 21 కథలతో ఈ పుస్తకం ఆకట్టుకుందని వెల్లడించారు.

ఆటో యూనియన్‌కు కొత్త కమిటీ

తిరుపతి కల్చరల్ : ఆటో యూనియన్ నగర నూతన కమిటీని బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా ఎస్.బాదుల్లా, ప్రధాన కార్యదర్శిగా జి.వాసు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రాము, రవి, కుమార్, మురుగా, సహాయ కార్యదర్శులుగా ప్రసాద్, హేమాద్రి, మంజునాథ్‌తో పాటు 25 మంది కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.


బాదుల్లా, అధ్యక్షుడు


వాసు, ప్రధాన కార్యదర్శి

ఘనంగా అభినయ్‌రెడ్డి జన్మదినోత్సవం


అభినయ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న టౌన్‌బ్యాంక్ చైర్మన్ జయచంద్రారెడ్డి తదితరులు


రక్తదాన శిబిరంలో మేయర్ శిరీష, మల్లం రవిచంద్రారెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పేందుకు పద్మావతిపురంలోని భూమన నివాసానికి భారీ సంఖ్యలో నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. మేయర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్, భీరేంద్రవర్మ, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి తదితరులు అభినయ్‌ను సత్కరించారు. కార్పొరేటర్ తమ్ముడు గణేష్, సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మానసవికాస్‌లోని దివ్యాంగులకు అన్నదానం చేశారు. పార్టీ యువజన విభాగం నగర అధ్యక్షుడు దినేష్‌రాయల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మల్లం రవి కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఇమ్రాన్ సాహెబ్ ఆధ్వర్యంలో రుయా వద్ద, రమణారెడ్డి ఆధ్వర్యంలో స్కావెంజర్స్ కాలనీ వద్ద అన్నదానం చేశారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో అభినయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో గాలి జనార్ధన్ రెడ్డి, సినీ నటుడు గాలి కిరీటి, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సమంత, సినీ నిర్మాత దిల్ రాజు తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.


ఆలయం వెలుపల గాలి జనార్ధన్ రెడ్డి, కిరీటి

నోటీస్ బోర్డు

- శ్రీనివాస స్పోర్ట్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటల నుంచి సబ్ జూనియర్ బాల బాలికల జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలు.
- తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీవ్రతం టికెట్లు ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల.
- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తుమ్మలగుంట గ్రామంలో ఉదయం 10.30 గంటలకు 'బాబు షూరిటీ -మోసం గ్యారంటీ' కార్యక్రమం.
- శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సాయంత్రం 4 గంటలకు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల ముగింపు కార్యక్రమం.
- అప్పలాయిగుంటలోని నరసింహస్వామి ఆలయంలో శ్రీసుదర్శన జయంతి సందర్భంగా ఉదయం 5.30 నుంచి ప్రత్యేక పూజలు.

స్వాతికి డాక్టరేట్



తిరుపతి రూరల్ : పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థిని డి.స్వాతికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆచార్య హరిపద్మరాణి పర్యవేక్షణలో 'ట్రాన్స్‌లేటింగ్ ది 1960 తెలుగు నావెల్ రేపటి వెలుగు ఇన్ టు ఇంగ్లిష్–ఏస్టడీ ఆఫ్ ది చాలెంజస్' అనే అంశంపై ఆమె పరిశోధన పత్రాలు సమర్పించారు.

పాత పెన్షన్ అమలుకు డిమాండ్

తిరుపతి సిటీ : డీఎస్సీ–2023 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం (అపస్) అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి వెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ తెలంగాణలో ఇదే కేటగిరీకి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని వెల్లడించారు.

2 నుంచి సామాజిక తనిఖీ

చంద్రగిరి : ఉపాధి హామి పథకం కింద చేసిన అభివృద్ధి పనులపై ఆగస్టు 2వ తేదీ నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఏపీఓ భార్గవి బుధవారం తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామి పథకం కింద రూ.20.60కోట్ల పనులు జరిగాయన్నారు. ఈ మేరకు అన్ని పంచాయతీలలో ఉపాధి కూలీలు, గ్రామస్తుల సమక్షంలో సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎక్కడైనా అవకతవకలు జరిగి ఉంటే ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

మహిళలకు వైద్య పరీక్షలు


మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అల్పాహారం వితరణ చేశారు. క్లబ్ రీజనల్ అధ్యక్షుడు ఎం.భాస్కర్, కార్యదర్శి చక్రపాణి, కోశాధికారి పురుషోత్తం నాయుడు, ఉపాధ్యక్షుడు జి.శంకర్, పి.రామారావు, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, లియో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బ్రహ్మయ్య, దనూష్, నిఖిల్, వైఎస్ బాబు పాల్గొన్నారు.